

# ఎందుకే నీకింత తొందరా...

## – బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

"**మీకు కావలసినవల్లా చేస్తాను** అంటున్నానుగా. నాకు కొంచెం టైం కావాలి. ప్లీజ్ ఎందుకు అని అడగకండి" అంది పరి.

అవ్లిన్ లేచి "టెల్ దెం ది ట్రూత్ అండ్ లెట్ అజ్ ఫేస్ ఇట్" అని గదిలోకి వెళ్ళిపోయింది.

అక్కడ కొన్ని క్షణాలు మౌనం రాజ్యం ఏలింది.

నేనూ లేచాను. ఇబ్బందిగా అనిపించి అక్కడినుండి లేచి వెళ్ళిపోడానికి.

"కూర్చో రిషీ నా ప్రోబ్లం నువ్వైనా అర్థం చేసుకుని వీళ్ళకి వివరించు" అంది పరి.

మళ్ళీ కూర్చున్నాను.

"చెప్పవే! మీ ఇద్దరికీ ఏ సంబంధమూ లేనప్పుడు ఆ ధీరజ్‌ని ఎందుకు హింసపెడుతున్నావ్? అతన్ని కలవకుండా, మాట్లాడకుండా, దీన్ని వెంటేసుకునొస్తావేం? అంది అత్తయ్య.

"చెప్తాను. అవ్లిన్ మెక్సికోనుండి ఇలీగల్ ఇమ్మిగ్రెంట్‌గా వచ్చింది. అక్కడ వాళ్ళది పూర్ ఫ్యామిలీ. చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ ఉన్నారు. తల్లి పేషెంట్. నెలనెలా చాలా మెడికల్ ఎక్స్‌పెన్సెస్ అవుతాయి. ఇక్కడ తనకి ల్యాబ్ అసిస్టెంట్‌గా మంచి జాబ్ దొరికింది. కానీ లీగల్ ఇష్యూస్. కేస్ పెట్టి డిపోర్ట్ చేస్తాం అన్నారు. తను వెనక్కి వెళ్ళిపోతే ఇంటిల్లిపాదీ బర్జార్న పడిపోతారు. అక్కడ తనకి తగ్గ జాబ్ ఆపర్ట్యూనిటీస్ లేవు."

"అయితే?" మామయ్య అడిగాడు.

"నాకు అవ్లిన్‌ని కాపాడ్డానికి ఒకే సొల్యూషన్ కనిపించింది. ఆమె నా రూం మేటే కాదు. చాలా మంచి అమ్మాయి. సోల్ మేట్ కూడా"

"ఏవిటా సొల్యూషన్?" నేను అడిగాను.

"వీ గాట్ మేరిడ్ అఫీషియల్లీ."

"ఆ?" మావయ్య అరిచాడు.

"ఏవంటున్నావే?" అత్తయ్య బలహీనంగా పలికింది.

నేను షాక్‌లోంచి ఇంకా కోలుకోలేదు. తెల్లవారుఝాము వరకూ నాదే పెద్ద ప్రోబ్లం అనుకున్నాను.

వసుంధరకి ఈ విషయం తెలిస్తే ఎలా రియాక్ట్ అవుతుందో?

"ఫర్ ఏ లిటిల్ పిరియెడ్. తనకీ బోయ్ ఫ్రెండ్ ఉన్నాడు. నాకు ధీరజ్‌లాగా. కొంచెం అతను సెటిల్ అవగానే నేను డివోర్స్ ఇస్తాను. అతను అవ్లిన్‌ని పెళ్ళి చేసుకుంటాడు. ఇద్దరూ సంపాదించి వాళ్ళ ఫ్యామిలీని చక్కగా చూసుకుంటారు."

"ఈ దరిద్రాన్ని అంతదాకా నువ్వు భరించాలా? ఈ సంగతి తెలిస్తే మన బంధువులు మా మొహాన పేడనీళ్ళు జల్లుతారు తెలుసా?" మావయ్య ఆవేశపడ్డాడు.

"నలుగురికీ తెలియాల్సిన అవసరం లేదు. నీ కూతురు ఓ ఫ్యామిలీని కాపాడడానికి ఎంత త్యాగం చేసిందో, తెలుసుకుని ప్రౌడ్‌గా ఫీల్ అవండి" అంది పరిమళ.

"దీన్ని నా అల్లుడు అనుకోవాలా?" అత్తయ్య ఏడుస్తూ అంది.

"ధీరజ్‌కి తెలిస్తే నీ మొహం చూడడు. ఛండాలపుదానా. చేసిన దౌర్భాగ్యపు దానికి నేను ఆనందంగా, గర్వంగా ఫీల్ అవ్వాలా? అంతకన్నా మాకింత విషం ఇవ్వవే" మావయ్య అరుస్తూనే వున్నాడు.

"ఇది రియాలిటీ. నిజం. మీరు భరించాలి ఎంత? ఓ సంవత్సరం పాటు .నేను కావాలనుకుంటే. లేదా ఇంకెప్పుడూ రాను. ఇదే చివరిసారి అవుతుంది మిమ్మల్ని చూడటం" అంది పరి.

"పరి డోంట్ టాక్ లైక్ దట్" అన్నాను.

"రిషీ కాలం మరుతోంది. వీళ్ళు అమెరికాలో వున్నా వీళ్ళ ఆలోచనలు సత్తెనపల్లిలోనే వున్నాయి. మారడంలేదు. హర్ట్ అవుతారనే ఆరునెలలుగా ఈ విషయం దాచాను. చెప్పేదాకా ప్రాణం తీసారు. చెప్పాక తట్టుకోలేక పోతున్నారు. నాకూ ఓ లైఫ్ వుంది. నాకూ ఇండివిడ్యుయాలీటీ వుంది. నా డెసిషన్స్ వీళ్ళని అడిగి తీసుకోనక్కర్లేదు. వీళ్ళు 1980లలో వీళ్ళ తల్లితండ్రుల అంగీకారంతో, ఆనందంగా పంపిస్తే అమెరికా వచ్చారా? మా బామ్మ ఎంతో ఏడ్చి ఏడ్చి పోయిందట. పెద్ద కొడుకు దగ్గర లేనందుకు.. వీళ్ళ స్వార్ధం వీళ్ళు చూసుకుని, వీళ్ళ జనరేషన్‌లో వీళ్ళు ఎదిరించలేదా వీళ్ళు పేరెంట్స్‌ని? మేం చేస్తే తప్పా? సే వాట్ ఈజ్ రాంగ్ ఇన్ ఇట్? నాకు అమెరికా తప్ప వేరే దేశం కల్చర్ గురించి పెద్దగా తెలీదు. అయినా తెలుగు నేర్చుకున్నా, పూజలు చేసా. పండగ వస్తే పరికిణీ కట్టుకున్నా, ఇండియన్ ఫుడ్ తిన్నా. కానీ ఇండియన్

భావాలతో, నాది కాని బతుకు బతకలేను. ధీరజ్ అయినా అర్థం చేసుకుంటే వెయిట్ చేస్తాడు. లేదా.. అతని దారి అతనిది. ఐ కాంట్ లివ్ ఫర్ అదర్ పీపుల్. నా ఇష్టాలు నావి. డిసీజ్ మై లైఫ్" అని

"ఎక్స్‌క్యూజ్‌మీ.." అని మిల్క్‌గ్లాస్‌తో పరి అల్విన్ వున్న గదిలోకి నడిచింది.

నాటకం తెరపడ్డాక కూడా ఇంకా ఆ కిక్‌లోనుండి బయటపడలేని ప్రేక్షకుల్లా ముగ్గురం ఈ లోకంలోకి ఇంకా రాలేనట్లు చేష్టలుడిగి, మౌనంగా ఒకరి మొహాలు ఒకరం చూసుకుంటూ కూర్చున్నాం.

మావయ్యే మొదట తేరుకుని "ఈ ముదనష్టపుది విడాకులకి ఒప్పుకోకపోతే ఇది సంపాదించే దాంట్లో, మన ఆస్తిలో కూడా అది కోడలిగా వాటా అడుగుతుంది" అన్నాడు.

అత్తయ్య ఇంకా అంతదూరం పోలేదు.

ఈ విషయం మా అమ్మకీ తమ్ముడికీ తెలిస్తే వాళ్ళు తట్టుకోలేరు. చుట్టపక్కాల్లో ఎంత అప్రదిష్ట?" అంటోంది. ఆవిడ సన్నగా ఏడుస్తోంది.

వసుంధర ఎప్పుడూ అంటుంది. "బిడ్డల్ని కంటాం కానీ వాళ్ళ జాతకాల్ని కంటామా?" అని. వీళ్ళ ప్రతిష్టపోడానికి, వీళ్ళేం చేసారని? పిల్లలు ఇష్టంతో చేసినదానికి పెద్దలదేం బాధ్యత?

"మా అమ్మకి ఈ విషయం చెప్పకు రిషీ, పాత తరం మనిషి, తట్టుకోలేదు" అంటోంది అత్తయ్య.

"చెప్పను అత్తయ్యా. నువ్వు ఏడవకూడదు. అసలే పచ్చి ఒళ్ళు" అన్నాను.

"ఆ... ఏం లాభం బతికి. ముదనష్టపు బతుకు. ఇంకా ఈ ఏడు పెళ్ళి చేసుకుంటుంది, ఆపై ఏడు మనవలని ఎత్తుకుంటాం అని ఆశపడ్డాను. వెధవ స్వేచ్ఛలు. మా పెద్దవాళ్ళు అయితే చెప్పుతో కొట్టేవారు. ఇలా వెధవపనులు చేస్తే" అని సణుగుతోంది అత్తయ్య.

మావయ్య "అంతా మా ప్రారబ్దం, మా కర్మ" అని అరచేతుల్లో మొహం దాచుకుని ఏడుస్తున్నాడు.

కాఫీ కలిపి ఇద్దరికీ తాగించేసరికి నా తలప్రాణం తోకకి వచ్చింది. ఇంతకీ పరి పెళ్ళాం. లేదా భర్త అయిన అల్విన్ నాకు ఏమౌతుంది? వరస ప్రకారం పరి భర్త అన్న, అల్విన్ ఇప్పుడు అక్కా?

వంటకి ఏమున్నాయి అని చూసాను. చామదుంపలూ, పాలకూరా, టొమేటోలూ తీసి బయటపెట్టాను. నాకూ పరి చేసినది పిచ్చిపనే అనిపించింది. రీసెర్చ్ స్కాలర్ పరి. బాగా సంపాదిస్తోంది. రేపు అల్విన్ విడాకులకి ఒప్పుకోకపోతే ఈ యవ్వనం, ఈ అందం అడవి కాచిన వెన్నెలేనా? అల్విన్‌కి సాయపడటానికి ఇంత జీవితాన్ని పణంగా పెట్టాలా? హూ! ఈ సేం జెండర్ పెళ్ళిళ్ళు ఆమోదించడం విషయంలో ఇప్పటిదాకా నాకు ఏ అభ్యంతరం లేదు. ఇప్పుడు నాకు అదీ ఇలా దుర్వినియోగపరుచుకుంటున్నందుకు, నచ్చలేదు. సమస్య బజారులో వుంటే అది ప్రమోదం. మన ఇంటిదాకా వస్తే ప్రమాదం.

అవ్లిన్ చాలా మాములుగా, ఇదంతా తన హక్కుగా భావిస్తూ, కిందకొచ్చి మిల్క్‌షేక్‌లూ, స్క్రాంబుల్డ్ ఎగ్స్ చేసుకుంటోంది. ఎక్కడా మొహంలో గిల్ట్‌గానీ, బాధకానీ లేవు. అత్తయ్యకి జావ తాగించడం చాలా కష్టం అయిపోయింది. మావయ్య భోజనం చెయ్యలేదు. ఓ గ్లాసు మజ్జిగ తాగి లైబ్రెరీ గదిలో తలుపులేసుకుని కూర్చున్నారు. ఎవరితోటీ పంచుకోలేని బాధ. కానీ మావయ్య తన ఫ్రెండ్స్ ఎటార్నీతో మాట్లాడి లీగల్ పాయింట్స్ అడగడం విన్నాను.

అభివృద్ధి చెందిన దేశం. ఎవరికీ ఈ విషయాల్లో ఆక్షేపణ లేదు. ఇక్కడ జీవితం, సౌకర్యాలూ, సంపాదనా కావాలి. సత్తెనపల్లిలో పరువు కావాలి పరి అన్నట్లు.

అత్తయ్య రాత్రికి కొంచెం స్థిమిత పడింది. "పరి భోంచేసిందా?" అని అడిగింది. ఎంతైనా తల్లి హృదయం.

"చేసింది" అన్నాను.

ఇన్‌ఫాక్ట్ చామదుంపల వేపుడు చాలా ఇష్టం అని 'రాత్రికి వుంచు. చపాతీలో కూడా తింటాను ' అంది. ఈ విషయం అత్తయ్యకి చెప్పలేదు. ఇందాక అదీ మనసు కష్టపెట్టుకుని తినలేదేమో, అని బాధపడ్డ తల్లి మనసు ఇప్పుడు ఇంత కాజువల్‌గా తల్లితండ్రుల బాధని తీసుకుని, చామదుంపల వేపుడు తినేసిందా? అని బాధపడచ్చు. జీవితం మంచి నీళ్ళలాంటిది. ఏ పాత్రలో పోస్తే ఆ షేప్ వస్తుంది. యద్భావం.. తద్భవతి. ఎలాగైనా మీనింగ్ తీసుకోవచ్చు. మనకి తెలిసినదంతా తెలివి అనుకుని చెప్పడం కాదు. కొన్ని దాచాలి. అదే ఇంగితం. ఇది వయసుతో బాటు రావాలి. ఎందుకనో చాలామందికి రాదు.

ఈవినింగ్ ద్వారక ఫోన్ చేసాడు"హాయ్ మై డైమండ్ రాణీ ఎలా వున్నావ్?"

"ఏమిటా పిలుపు? నేనేదో పాత సినిమాల్లో 'మోనికా..' అని డాన్స్ చేసే హెలెన్‌లాగా" అన్నాను.

వజ్రం కూడా ఒక మణేకదా! అని చాలా ecastecy అన్నాను" అన్నాడు.

"సంతోషించాంలే" అన్నాను

"ఏం ఆలోచించావ్? హత్యా? పెంచుకుందామా?" అన్నాడు. పొద్దుట ఆపిన టాపిక్‌ని పొడిగిస్తూ.

"అది పెద్ద సమస్యే కానీ ఇంట్లో ఇప్పుడు ఇంకా పెద్ద సమస్య వచ్చింది" అన్నాను.

"ఏమిటి?" అన్నాడు.

"పరిమళ అదే మా కజిన్ లేదూ. తను ఇంకో పెద్ద బాంబ్ పేల్చింది" అంటూ అవ్లిన్, పరీల పరిణయ గాథ మొత్తం చెప్పి, " పెద్దవాళ్ళు ఆపోజిట్ జెండర్ పెళ్ళిళ్ళలోనో, కులం, మతం, అంతస్తులూ అన్నీ చూస్తారు. అలాంటిది సేం జెండర్ అంటే అరిగించుకోవడం ఎంత కష్టం?" అన్నాను.

ద్వారక పెద్దగా నవ్వి "ఇప్పుడు పెద్ద గీత ముందు మన సమస్య చిన్న గీత అయిపోయిందిగా మీ అమ్మానాన్నలకి ఈ విషయం చెప్పు" అన్నాడు.

"ఏడ్చినట్టుంది. ముందు ఎనభై ఏళ్ళ బామ్మ ఈ విషయం విని హార్ట్ ఫెయిల్ అయి చస్తుంది. తన మనవరాలు పెళ్ళి చేసుకున్నది, తనలాంటి ఆడదానినే అని తెలిసినందుకు" అన్నాను.

ద్వారక కొంచెం సేపు సైలెంట్‌గా వుండి, తర్వాత అన్నాడు "జరిగినదాంట్లో శాడ్ పార్ట్ ఏంటి అంటే, అల్విన్‌కీ, పరీకీ వేరే వేరే ఆపోజిట్ జెండర్ బోయ్ ఫ్రెండ్స్ వుండడం. అదే ఇద్దరూ లెస్బియన్స్ అయి, వీళ్ళు ఈ విషయంలో హేపీగా వుండి వుంటే ఏ గొడవా వుండేదికాదు. పెద్దవాళ్ళు ఒక నెలో, రెండు నెలల తర్వాతో సర్దుకునేవారు" అన్నాడు.

"అవును" అన్నాను. నేనీ విషయం ఇంతదాకా ఆలోచించలేదు. ఈ నిరర్ధక త్యాగం వల్ల పరీ, ధీరజ్ ఇద్దరూ బాధపడాలి. ఒక పక్క అల్విన్ బోయ్ ఫ్రెండ్ కూడా ఈ పిచ్చి పని చెయ్యకపోతే అల్విన్‌ని డిపోర్ట్ చేసి వుండేవారు. పరి చెప్పినట్లు ఆమెని జైలుకి పంపిస్తే ఆ కుటుంబం ఏమైపోయేదీ?

ద్వారకా, నేనూ కాసేపు మాట్లాడుకుని మా సమస్యని తాత్కాలికంగా పక్కన పెట్టేసాం. అతని ఫోన్ పెట్టేసాక, నా మీద ధీరజ్ పెట్టిన గురుతర బాధ్యత గుర్తొచ్చింది. ధీరజ్‌కి ఇదంతా నేను చెప్పాలా? పరి చెపితే బావుంటుంది కదా! డైరెక్ట్‌గా తనని నమ్మి తనతో బాధ పంచుకుందన్న ఆనందమైనా మిగుల్తుంది. ఇదే కరెక్ట్ అని సమాధానపడి పరి దగ్గరకి వెళ్ళాను.

పరి, అల్విన్‌ని ఏదో ఘాటుగానే అన్నట్లుగా వుంది. అల్విన్ కళ్ళు ఏడ్చినట్లు ఎర్రబడివున్నాయి. "రా" అంది పరి.

"పరీ! అర్ధం చేసుకోవడం పరిస్థితి కష్టంగానే వుంది. కానీ ఇంట్లో చెప్పి మంచి పని చేసావ్" అన్నాను.

"అవును ప్రతిసారీ అబద్ధం చెప్పి నమ్మించడం చాలా కష్టంగా వుంది" అంది పరిమళ.

అల్విన్ లేచి బయటకి వెళ్ళింది.

"కానీ ఇంకో ముఖ్యమైన వ్యక్తికి కూడా నువ్వే చెప్పాలి. ధీరజ్‌కి" అన్నాను.

పరి అరచెయ్యి చూసుకుంటూ ఆలోచనలో పడింది."ఎలా మొదలు పెట్టాలో తెలీడం లేదు. అసలు .. అసలు ధీరజ్ నమ్మలేదు" అంది.

"అవును. మరీ ముందుకెళ్ళిపోయారుగా" అన్నాను.

"వాట్? నీతో మా ఫిజికల్ రిలేషన్ గురించి చెప్పాడా?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది.

తల వూపాను.

"రుషీ అసలు అది అలా ఇంటిమేట్‌గా అతనితో తప్ప మరొకరితో ఊహించుకోలేను తెలుసా?" అంది.

"అతనూ అదే అన్నాడు. నువ్విలా అన్నావని. అందుకే నేను తనకి ఎవరైనా కలిసారేమో అంటే నమ్మలేదు" అన్నాను.

"నేను అల్విన్ గురించి చేసింది మానవతా దృక్పథంతో. త్యాగం మరీ పెద్ద వర్డ్ అవుతుందేమో" అంది.

"నువ్వు ఓ మిలియన్‌లోన్ తీసి ఇచ్చినా అత్తయ్యా మావయ్యా ఇంత అప్‌సెట్ అయ్యేవారు కాదు" అన్నాను.

"కానీ అవ్లిన్ డిపోర్ట్ అయిపోయేది" అంది.

"ఓ మాట. డిస్కస్ చేసి వుండాల్సింది" అన్నాను.

"అందరూ వద్దు అనే అంటారు.  అయినా ఇది నా జీవితం. అర్థం చేసుకోవాలి వాళ్ళు" అంది.

"అది నిజమే. అరటి చెట్టు పిలకలు పెట్టాక, అవి సెపరేట్ చెట్లుగా పెరగాలి. తల్లి చెట్టుని గెలేసాక కొట్టేస్తారు" అన్నాను.

"ఎవరూ ఎవరినీ కొట్టెయ్యలేదు. వాళ్ళకి డబ్బులున్నాయి. సిటిజెన్ షిప్ వుంది. ఏ క్షణాన అయినా మనసు మార్చుకుంటే ఇండియా వెళ్ళిపోయి బ్రతకొచ్చు" అంది

అమ్మ అంటూ వుంటుంది నాతో "ఇప్పుడు తెలీదే నీ కడుపున పిల్లలు పుడితే తెలుస్తుంది. మా జీవితం మీ జీవితాలతో ఎలా పెనవేసుకుపోయిందో" అని.

"సరే ధీరజ్‌కి కూడా వీళ్ళకి చెపినట్లే చెప్పెయ్" అన్నాను.

"ఎస్" ఆమె సెల్ చేతిలోకి తీసుకుంది.

నేను లేచి వస్తూ ఆ గది తలుపు దగ్గరకి వేసాను. ఇంకో హృదయం అవతల వైపునుండి ఫెటీల్మని బద్దలైన శబ్దం వస్తుంది. ఇంకాసేపట్లో, అని తెలుసు.

హనీష్ వచ్చాడు మర్నాడు. ఇంట్లో పేరుకున్న యుద్ధం  తరువాత ప్రశాంతత వాడికి అర్థం అయింది.

అత్తయ్య దగ్గరకి వెళ్ళి "హాయ్ అత్తయ్యా" అని వాడు పలకరించగానే, వాడి మెడని పట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చేసింది.

"అచ్చం మా తమ్ముడిలా కనిపించావుతరా" అని కవర్ చేసింది. నిజంగానే హనీగాడు దూరం నుండి చూస్తే నాన్నలా వుంటాడు. వాడి కంఠస్వరం కూడా.

మావయ్య పది లంఖణాలు చేసిన వాడిలా, గెడ్డంకూడా గీసుకోకుండా, స్మోక్ చేస్తూ జబ్బు పడ్డవాడిలా వచ్చి పలకరించాడు.

"అత్తయ్యకి ఒంట్లో బానేవుంది కదా!" అన్నాడు హనీ.

"అంతా బానేవుంది" అన్నాడు మావయ్య.

"పరీ ఏదీ?" అడిగాడు.

"బయటకి వెళ్ళింది" అంది అత్తయ్య.

కిచెన్‌లో వంట చేస్తున్న నేను పరీ, అవ్లిన్ బయటకి వెళ్ళడాన్ని గమనించలేదు.

"రా.. స్నానం చేసి అన్నం తిందువుగని. అమ్మ నీ కోసం కూడా పచ్చళ్ళూ, వడియాలూ, పంపించింది" అన్నాను.

"కొంపదీసి నీ వంటా?" వాడు అడిగాడు.

టాంబాయిలాగా తిరిగే నేను వంటా గింటా చెయ్యడం వాడు పెద్దగా చూడలేదు.

"తిని చూడు" అన్నాను.

హనీ స్నానం చేసొచ్చేసరికి, డైనింగ్ టేబుల్ దగ్గర పరీ, అవ్లిన్ కూడా వున్నరు. సీరీల్స్ ఏవో తింటున్నారు.

"హాయ్ పరీ" అని అవ్లిన్‌ని చూసి ఆగాడు.

"హాయ్ హనీ" పరీ లేచి హగ్ చేసుకుని 'షీ ఈజ్ అవ్లిన్ ' అంది.

"మై బెటర్ హాఫ్" అని కూడా చెప్పు మనసులో అనుకున్నా.

"హాయ్" అని వాడు విష్ చేసి పరీతో "భలే వుందే.. నన్ను పెళ్ళి చేసుకుంటుందేమో అడుగు" అన్నాడు ఆట పట్టిస్తూ.

"ముందే నిన్ను పరిచయం చేస్తే బావుండేది" పరీ నవ్వుతూ అంది.

"కొంపదీసి మేరీడా?" అన్నాడు వాడు.

"ముందు అన్నం తిను. నీకిష్టమైన గోంగూర పప్పూ, బెండకాయ ఫ్రై" అన్నాను.

పరీ లేచి "ఎక్స్‌క్యూజ్‌మీ" అని తన గదిలోకి వెళ్ళింది.

అవ్లిన్ "బై" అని హనీష్‌కీ నాకూ చెప్పి, తనూ వెళ్ళింది.

హనీ అన్నం కలుపుకుంటూ "సంథింగ్ ఈజ్ వియర్డ్.. అత్తయ్యకి ఒంట్లో బాలేదనుకో. మావయ్య ఎందుకు అలా డల్‌గా వున్నారూ?" అన్నాడు.

"నీకేం చెప్పాలో తెలీడం లేదు" అన్నాను.

"ఏవైందీ?"

"పరీ పెళ్ళి చేసుకుంది."

"ఓ!వెరీగుడ్. హూ ఈజ్ దట్ లక్కీ మ్యాన్?" అన్నాడు.

"మేన్ కాదు వుమెన్" అని పరిస్థితి చెప్పాను.

హనీష్ కొంచెం షాక్ అయినా, వెంటనే తేరుకుని "డివోర్స్ తీసుకుని ఇంకోడ్ని చేసుకుంటుందిగా అంతదాకా ఓపిక పట్టడమే" అన్నాడు.

"అదే మరి జనరేషన్ గ్యాప్. వాళ్ళకి ఇది అంత చిన్న విషయంగా అనిపించడంలేదు" అన్నాను.

"మజ్జిగ పులుసు బావుంది. అచ్చు అమ్మలా చేసావ్. ఇంతకీ బామ్మ ఎలా వుందీ? సెంచరీ కొడ్తా అంటోందా?" అడిగాడు.

"పరి విషయం తెలిస్తే బకెట్ తన్నేస్తుంది" అన్నాను.

"ఇది అంత సీరియస్‌గా తీసుకోనక్కరలేదు" అన్నాడు.

ఇద్దరం నా రూములోకి వెళ్ళాం. వాడూ అక్కడే తన సామాన్లు పెట్టుకున్నాడు.

"నీ విషయం ఏమిటీ? అమ్మావాళ్ళు తెగ వర్రీ అవుతున్నారు నీ పెళ్ళి విషయం?" అన్నాడు.

"ఆడా మగా బేధం లేకుండా ప్రపంచం చాలా విశాలంగ వుంది. నాకూ ఒక మనిషి దొరక్కపోతారా?" అన్నాను.

"ఎవరూ దొరకలేదా? ఐ యాం ఎషేమ్డ్ ఆఫ్ యూ" అన్నాడు.

"ఎందుకు దొరకలేదూ?" అన్నాను.

"చెప్పు ఎక్కడ దొరికాడూ?" అని దిండు సరిచేసుకుని పడుకున్నాడు.

"ద్వారక" అన్నాను.

"హస్తినాపురికాదూ? ప్లేస్ కాదు పర్సన్ పేరు చెప్పు" అన్నాడు.

"అదే పేరు ద్వారకా నందన్" అన్నాను. తర్వాత అతను పరిచయం అవడం, నేనూ అతనంటే ఇష్టపడడం చెప్పాను.

"ఇంకా సీరియస్‌గా ఏమీ అనుకోలా. కానీ అమ్మావాళ్ళు చూసే గోపాలం, రామనాథం సంబంధాలు చేసుకోను" అన్నాను.

"సుందరం పిచ్చాయ్.. శునక్ ఇలాంటి వాళ్లని కూడా పేర్లు చూసి రిజెక్ట్ చేసేదానివా?" అడిగాడు నవ్వుతూ.

"ప్రపంచం ఇంత ఫాస్ట్‌గా మూవ్ అయిపోతూవుంటే నాకు వాళ్ళు జాతకాలూ అవీ చూసి పెళ్ళి చేయడం ఏవిట్రా?" అన్నాను విసుగ్గా.

"నాకు చెయ్యమను జతకం చూసి ఐదు రోజుల పెళ్ళి" అన్నాడు.

"నీకీపాటికి ఏ ఆఫ్రికన్ అమెరికనో, తగిలే వుంటుంది అనుకున్నానే" అన్నాను.

"నీ గెస్ కరెక్టే, కానీ త్రీమంత్స్ డేటింగ్ చేసేలోపే వాళ్ళ ఇంట్లో వాళ్ళు పెళ్ళి చేసేసారు" అన్నాడు.

"అదేంటీ? ఇక్కడా అంత కన్సర్వేటివ్‌గా వుంటారా?" ఆశ్చర్యంగా అడిగాను.

ఏ దేశం అయినా అన్ని రకాల వాళ్ళూ వుంటారు" అన్నాడు.

"అవును మనుషులలో స్థాయీ భావాలు, యూనివర్సల్‌గా సమానం. కుటుంబం మీద ప్రేమా.. వాత్సల్యం మద మాత్సర్యాలూ అన్నిచోట్లా సమానమే. అలాగే క్రైం కూడా.

హనీష్ వీకెండ్ వుండి,అందరినీ కాస్త నవ్వించి, ఇంటి వాతావరణం మామూలుగా చేసి, మండే వెళ్ళిపోతాడు అనగా "ఎయిర్‌పోర్ట్‌కి నేనూ వస్తా" అన్నాను.

"ఒద్దు.. వెనక్కి ఎలా వస్తావ్?" అడిగాడు.

"ద్వారక వచ్చి మనిద్దరినీ తీసుకెళ్తాడు. అతనే దిగబెడ్తాడు" అన్నాను.

"ఓ బావతో ఇంట్రడ్యూస్ చెయ్యడానికా?" అని నవ్వాడు.

"బావ అవునోకాదో కానీ ప్రస్తుతానికి నాకు క్లోజ్ ఫ్రెండ్" అన్నాను.

"ఓ.కే లెట్ అజ్ హోప్. నీతో ఇంత క్లోజ్‌గా వున్నాక కూడా అతనికి పెళ్ళి చేసుకునే ఇంట్రెస్ట్ వుండాలని" అన్నాడు దణ్ణం పెడ్తూ.

ఈవినింగ్ ద్వారక వచ్చాడు. నేను ఇండియన్ డ్రెస్ చుడీదార్, బిందీతో వున్నాను.

ద్వారకని ఇంట్లోకి తీసుకొచ్చాను.

అత్తయ్యా మావయ్యా, అల్విన్, పరిమళా, హనీష్ అందరికీ ఇంట్రడ్యూస్ చేసాను.

అత్తయ్య ఆ రోజు పులిహోర చేసింది. నేను గులాబ్ జాం తీసుకొచ్చి పెట్టాను. ద్వారక అందరితో కబుర్లు చెప్తూ అవి తిన్నాడు. మావయ్యకి ద్వారక బాగా నచ్చినట్లున్నాడు. చాలా ఎక్కువ మాట్లాడారు.

హనీ "ఇంక బయల్దేరాలి" అనడంతో ద్వారక లేచాడు.

ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళే దారిలో హనీస్ చెప్పాడు "రుషికి మా పేరెంట్స్ పెళ్ళి చెయ్యాలనుకుంటున్నారు" అని.

"ఓ!" అన్నాడు ద్వారక.

ఆ తరువాత మళ్ళీ సినిమాలూ, టాక్సులూ, హనీగాడి ఉద్యోగాల వేటా, మాట్లాడుకున్నారు.

"నేను చూస్తాను.. వర్రీ అవద్దు జాబ్ గురించి" అన్నాడు ద్వారక.

హనీ కార్ దిగుతూ "బై రుషీ..బై ద్వారకా" అని వెళ్ళిపోయాడు.

"ఇంటికి వెళ్దాం" అన్నాడు ద్వారక.

"ఒద్దు" అన్నాను.

"నేనంటే ఒక్కసారితోనే ఇష్టంపోయిందా?" అడిగాడు ద్వారక.

"మూడ్ లేదు" అన్నాను.

"ఏం చేస్తే నీ మూడ్ బాగు అవుతుంది?" అడిగాడు ద్వారక.

నా మనసులో కలగాపులగంగా ఆలోచనలు. మావయ్యకి ద్వారకని చూస్తే "ఇలా వుండాలి అల్లుడు అంటే అన్న ఆలోచనలు రేగాయి. హనిగాడికి 'మీరిద్దరూ పెళ్ళి చేసుకుంటే బావుంటుంది అనే ఆలోచన వచ్చింది. అమ్మానాన్నలై పిల్ల పెళ్ళి చెయ్యడం, లైఫ్ టైం ఎఛీవ్‌మెంట్. ఎంతైనా కాదనలేని కోరిక. కానీ ద్వారక చాలా ప్రాక్టికల్. ఇన్నాళ్ళూ వసుంధరతో వాదించి, లాజికల్‌గా మాట్లాడి నేనే చాలా ప్రాక్టికల్ అనుకునేదాన్ని. ద్వారకని కలిసాక ఇంత ప్రాక్టికాలిటీ అవసరమా అనిపిస్తోంది.

రెస్టారెంట్‌లో ఎక్కువ జనం లేరు.

బుగ్గమీద ఏదో పాకినట్లయి, కళ్ళు తెరిస్తే, ద్వారక ముద్దు పెట్టి, నవ్వుతున్నాడు.

"ఏంటి అంత దీర్ఘాలోచనా? ఇంటి పైకప్పుకి ఏ రేకులు వెయ్యాలనా? ఏజ్‌బెస్టాస్ షీట్స్ వెయ్యి" అన్నాడు.

నాకూ చిన్నప్పుడు విన్న ఆ రేడియోలో వచ్చే ఎడ్వర్‌టైజ్‌మెంట్ గుర్తే. చిన్నగా నవ్వి,

"ద్వారకా ఒకవేళ మనం ఇలా రిలేషన్లో కొన్నాళ్ళు వున్నాక, నీకు బోర్ కొట్టి, వేరే అమ్మాయిమీద ధ్యాస మళ్ళితే నేను నిన్ను హోల్డ్ చెయ్యలేను కదా! అప్పుడు నా పరిస్థితి ఏవిటీ?" అన్నాను.

ఎదురుగా వున్న కపాచినో కాఫీలో హార్ట్ గుర్తు కనిపిస్తోంది.

"అటు తిప్పీ ఇటు తిప్పీ మళ్ళీ పెళ్ళీ, సెక్యూరిటీ వైపే తిప్పావు టాపిక్. పెళ్ళి అయ్యాక వేరే అమ్మాయి మీద మనసు పుట్టి భార్యలకి తెలీకుండా అక్రమ సంబంధాలు పెట్టుకునే వాళ్ళు ఎంతమందో తెలుసా? అప్పుడు భార్యలు చూసీ చూడనట్లు వదిలేస్తారా? లేదా వాళ్ళూ ఇంకో దారి చూసుకుంటారా?" అన్నాడు.

COMMENTS